ఇఏపిసెట్ ప్రిలిమినరీ కీ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్–ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన టిఎస్ఇఏపిసెట్ 2024 పరీక్షల ప్రిలిమినరీ కీ, రెస్పాన్స్ షీట్లు ఆదివారం విడుదలయ్యాయి. ఫార్మసీ విభాగానికి సంబంధించిన కీని శనివారం విడుదల చేసిన అధికారులు.. తాజాగా ఇంజనీరింగ్ స్ట్రీమ్ ప్రిలిమినరీ కీని అందుబాటు లోకి తీసుకొచ్చారు. కింద ఇచ్చిన లింక్‌పై క్లిక్ చేయడం ద్వారా విద్యార్థులు ప్రిలిమినరీ కీతో పాటు రెస్పాన్స్ షీట్, మాస్టర్ ప్రశ్నపత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో మే ఏడు నుంచి 11వ తేదీ వరకు టిఎస్ ఇఏపి సెట్ పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఏడాది ఇఏపి సెట్ కోసం తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 3.54 లక్షల మందికి పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. అగ్రికల్చర్ అండ్ ఫార్మా ప్రిలిమినరీ కీపై ఈ నెల 13 వరకు, ఇంజనీరింగ్ స్ట్రీమ్ కీపై ఈ నెల 14న ఉదయం 11గంటల లోపు అభ్యంతరాలు తెలపవచ్చు.

కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో సోమవారం (13వ తేదీ) కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పోలింగ్ సిబ్బంది, ఉద్యోగులకు మంగళవారం ఆన్ డ్యూటీగా పరిగణించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఈనెల 14వ తేదీ (మంగళవారం) ఉదయం ఆరు గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు మినహా మిగతా అన్ని చోట్లా ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది

పోలింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికలలో భాగంగా సోమవారం జరగనున్న పోలింగ్ కార్యక్రమానికి సంబంధించి ప్రతి అంశంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో పోలింగ్ నమోదు, సమాచారాన్ని సేకరించి ఆన్ లైన్‌లో నమోదు చేసే ప్రక్రియపై కంప్యూటర్ ఆపరేటర్లు, అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కార్యక్రమంలో ప్రతి అంశంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలింగ్ శాతాన్ని సెక్టార్ అధి కారుల వద్ద నుంచి ప్రతి రెండు గంటలకు నమోదైన ఓటర్ల వివరాలు సేకరించాలన్నారు. నియోజకవర్గానికి ఒక జిల్లాస్థాయి అధికారి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఒక ఆపరే టర్ 3/4సెక్టార్ అధికారుల నుంచి పోలింగ్ శాతాన్ని సేకరించాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం 9 నుంచి 11 గంటలకు, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటలకు, 4 గంటలకు వివరాలు సేకరించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఇన్ చార్జిలుగా వ్యవహరించే జిల్లాస్థాయి అధి కారులు ఈప్రక్రియను పర్యవే క్షించాలని తెలిపారు.

బస్సుల కోసం నిరీక్షణ

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రయాణికులకు సరిపడ బస్సులు లేకపోవడంతో దూరప్రాంతాలకువెళ్లే ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆదివారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో బస్సుల కోసం ప్రయా ణికులు గంటల తరబడి వేచి చూశారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ బస్సులన్నీ పోలింగ్ సిబ్బందిని తరలించేం దుకు ఉపయోగించారు. దీంతో కొన్ని బస్సులు మాత్రమే షెడ్యూల్ ప్రకారం నడవగా అవి సరిపోకపోవడంతో ప్రయాణి కులు ఇబ్బందులుపడ్డారు.

సిద్ధాంతాలు ఒక్కటి కావడం వలనే..

- చిన్న పార్టీలతో పొత్తుపై కాంగ్రెస్ నేత శశిధరూర్

న్యూఢిల్లీ : చిన్న పార్టీలు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం లేదా విలీనం కావడంపై ఆ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ స్పందించారు. సిద్ధాంతాలు ఒకటే అయినప్పుడు వేర్వేరుగా ఉండటం ఎందుకని ప్రశ్నించారు. ముంబయిలో ఒక కార్యక్రమంలో పాల్గొన్న థరూర్ కాంగ్రెస్‌తో పలు ప్రాంతీయ పార్టీల పొత్తులు, విలీన సంభావ్యతపై ఇలా స్పందించారు. అలాగే, మహారాష్ట్రలో అజిత్ పవార్, ఏక్‌నాథ్ షిండేలతో చేతులు కలపాలని పవార్, ఉద్ధవ్‌లకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించడాన్ని శశిథరూర్ తప్పుపట్టారు. కాంగ్రెస్‌తో కలిసివెళ్లడం కంటే అదే మేలని ప్రధాని చెప్పడంలో అర్థం లేదన్నారు. ఇక ఇండియా వేదికలో చేరని పార్టీలు.. లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత అందులో చేరతాయన్నారు.

వచ్చే రెండేళ్లలో అనేక ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌తో మరింత సన్నిహితంగా మెలిగే అవకాశం ఉందని శరద్ పవార్ ఇటీవల పేర్కొన్నారు. అంతేకాకుండా కొన్ని పార్టీలు అందులో విలీనం కూడా కావచ్చన్నారు. ఓ జాతీయ వార్తా పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవార్ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికలకు 164 కంపెనీల కేంద్ర బలగాలు

- 73,414 సివిల్ పోలీసులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలను సజావుగా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు పటిష్ఠ భద్రత ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు కలిగించినా సహించేది లేదని డిజిపి రవిగుప్త స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల బందోబస్తు నిమిత్తం 73,414 సివిల్ పోలీసులు, 500 సెక్షన్ల టిఎస్ఎస్‌పి సిబ్బంది, 164 కంపెనీల కేంద్ర బలగాలు, మూడు కంపెనీల తమిళనాడు పోలీసులు, 2088 మంది ఇతర శాఖల సిబ్బందితోపాటు సుమారు ఏడు వేల మంది హెూంగార్డులు విధుల్లో నిమగ్నం కానున్నారు. ఎన్నికల నియమావళిని అనుసరించి తనిఖీ కేంద్రాల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 482 ఫిక్స్‌డ్ స్టాటిక్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ)లు, 462 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టి)లు, 89 అంతర్రాష్ట్ర సరిహద్దు తనిఖీ కేంద్రాలు, 173 అంతర్‌జిల్లా తనిఖీ కేంద్రాలు పని చేస్తున్నాయి. ఎన్నికల ముందు మద్యం, డబ్బు, తాయిలాల పంపిణీ ఊపందుకునే అవకాశాలుండటంతో ప్రస్తుతం వీటి ద్వారా నిఘా విస్తృతం చేశారు.

రూ.186 కోట్ల విలువైన సొత్తు జప్తు

మార్చి 16న ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినప్పటి నుంచి శనివారం నాటికి రూ.186.12 కోట్ల విలువైన సొత్తు జప్తు చేశారు. వీటిలో రూ.93.94 కోట్ల నగదు, రూ.10.07 కోట్ల విలువైన మద్యం, రూ.7.86 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ.62.77 కోట్ల విలువైన ఆభరణాలు, రూ.11.48 కోట్ల విలువైన పంపిణీ సామగ్రి ఉన్నాయి. మాదక ద్రవ్యాల చట్టం, ఎక్సైజ్ చట్టం, ఐపిసి, ప్రజాప్రాతినిధ్య(ఆర్‌పీ) చట్టం కింద మొత్తం 8,863 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో ఒక్క ఎక్సైజ్ చట్టం కిందే 8,044 ఎఫ్ఐఆర్‌లు ఉన్నాయి. అలాగే నార్కోటిక్స్ కేసుల్లో 293, ఐపిసి సెక్షన్ల కింద 473, ఆర్‌పీ యాక్ట్ కింద 53 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 34,526 మందిని బైండోవర్ చేశారు.

పోలింగ్ సిబ్బందికి కమ్యూనికేషన్ నెట్‌వర్క్

పోలింగ్ నేపథ్యంలో డిజిపి కార్యాలయంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి కమాండ్ కంట్రోల్ రూం అందుబాటులోకి వస్తుంది. పోలింగ్ ముగిసి, ఇవిఎంలను స్ట్రాంగ్‌రూంల్లోకి సురక్షితంగా తరలించే వరకు ఇది నిరంతరంగా పనిచేస్తుంది. అలాగే పోలింగ్ సిబ్బంది కోసం కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ఏర్పాటు చేశాం. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు, అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఈ నెట్‌వర్క్ ద్వారా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసే వీలుంది.



ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్‌లకు మాధ్యమిక విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభించనున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, ఎయిడెడ్ సాంఘిక సంక్షేమ ,గిరిజన ,మైనార్టీ గురుకుల , మోడల్ జూనియర్ కళాశాలల్లో ఒకేసారి అడ్మిషన్‌లు నిర్వహించనున్నారు.

అందుబాటులో 20 కోర్సులు..

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులకు జనరల్ సైన్స్ విభాగంలో ఎంపిసి, బైపిసి, హ్యూమానిటీస్ విభాగంలో ఎంఇసి, హెచ్ఇసి, హెచ్‌జిఒ, సిఇసి, సిఇజి వంటి 20 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఒకేషనల్ విభాగంలో అగ్రికల్చర్, బిజినెస్ అండ్ కామర్స్, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కోర్సులు, హెూం సైన్స్‌కు సంబంధించిన 21 కోర్సులు అందుబాటులో ఉన్నాయి. జనరల్ విభాగంలో దాదాపు అన్ని కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ , హెచ్ఈసీ విభాగాల్లో ఒక్కో గ్రూపులో దాదాపు 60 సీట్లు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఒకేషనల్‌కు సంబంధించి ఆయా కోర్సులు పొందిన అడ్మిషన్‌లనుబట్టి సీట్ల సంఖ్యను నిర్ణయిస్తారు.

16 కళాశాలలు..

జిల్లాలో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, సోషల్ వెల్ఫేర్, బిసి, మైనార్టీ వెల్ఫేర్, రెసిడెన్షియల్, మోడల్ జూనియర్ కళాశాలలు 6, మొత్తం 16 ప్రభుత్వ యాజమాన్యాల కళాశాలలు అందుబటులో ఉన్నాయి. ప్రతి కళాశాలలో సైన్స్ విద్యార్థులకు అవసరమైన సైన్స్ ల్యాబ్, పరికరాలు, ఒకేషనల్ విద్యార్థులకు అవసరమైన పరికరాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులందరికి స్కాలర్‌షిప్ కూడా ప్రభుత్వం అందిస్తుంది. ప్రైవేటుకు ధీటుగా మెరుగైన ఫలితాలు కూడా వస్తున్నాయి.

ప్రాజెక్టు సైటు ఎందుకు మార్చాల్సి వచ్చింది...?

- కాళేశ్వరం ఇఎన్‌సిని ప్రశ్నించిన జ్యుడీషియల్ కమిషన్
- 14న ఎస్ఇలు, ఇఇలతో ఇఎన్‌సి సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ఎత్తిపోతల నిర్మాణ స్థలాన్ని ఎందుకు మార్చాల్సి వచ్చిందంటూ కాళేశ్వరం మాజీ ఇఎన్‌సి నల్లా వెంకటేశ్వర్లును జ్యుడిషియల్ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పిసి ఘోష్ ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని బిఆర్కేభవన్‌లోని కాళేశ్వరం న్యాయవిచారణ కమిషన్ కార్యాలయంలో పిసి ఘోష్.. నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో మరోమారు సమావేశమయ్యారు. ఇఎన్‌సిలు అనిల్‌కుమార్, నాగేంద్రరావు, సిఇ సుధాకర్‌రెడ్డిలతో భేటీ అయిన అనంతరం మాజీ ఇఎన్‌సి వెంకటేశ్వర్లుతోనూ భేటీ అయ్యారు. ఎత్తిపోతలకు సంబంధించిన వివరాలపై వెంకటేశ్వర్లును జస్టిస్ ఘోష్ ప్రశ్నలు అడుగగా ఆయన సమాధానాలు తెలిపారు.విశ్వసనీయ సమాచారం మేరకు.. ఆదిలాబాద్ జిల్లాలో నిర్మించాల్సిన ప్రాజెక్టును మేడిగడ్డ వద్దకు ఎందుకు మార్పు చేయాల్సి వచ్చిందని కమిషన్ అడిగిన ప్రశ్నకు.. వ్యాప్కోస్ సంస్థతో సర్వే, లైడార్ సర్వేలో వచ్చిన ఫలితాలు, మహారాష్ట్రలో ముంపు ఉండటంతోనే మేడిగడ్డ వద్దకు మార్చాల్సి వచ్చిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ డిజైన్లలో మార్పులు ఎందుకు జరిగాయన్న దానిపై.. మేడిగడ్డను స్పెషల్‌గా డిజైన్ చేసినట్లు, బ్యారేజీ కమ్ డ్యాం తీరులో ఉపయోగించుకునేలా నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ప్రాజెక్టు తీరుపై మాజీ ఇఎన్‌సి కొంత నిడివితో కూడిన ప్రజంటేషన్ ఇవ్వడంతో పాటు తనకు రెండు గంటల సమయం ఇస్తే మరిన్ని వివరాలు అందజేస్తానని చెప్పినట్లు తెలిసింది. మరోవైపు కమిషన్ ఆదేశం మేరకు మూడు బ్యారేజీలకు సంబంధించిన నోట్‌ను సీఈ సుధాకర్‌రెడ్డి జస్టిస్ ఘోష్‌కు అందజేశారు. రెండో విడత విచారణలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చి విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ ఆదివారం కోల్‌కతాకు వెళ్లనున్నారు. ఈ నెలాఖరున మరోమారు వచ్చి విచారణ జరపనున్నట్లు తెలిసింది.మేడిగడ్డ బ్యారేజీ రక్షణకు చేపట్టాల్సిన చర్యలపై 14న నీటిపారుదల శాఖ ఇఎన్‌సి అనిల్‌కుమార్, ప్రాజెక్టు ఎస్ఇలు, ఇఇలతో హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. కమిటీ ఏర్పాటు, సిఫార్సులు అందించేలోగా తీసుకోవాల్సిన చర్యలపై ఇఎన్‌సి ఇంజినీర్లతో చర్చించనున్నట్లు సమాచారం.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సిఎం రేవంత్

ఎన్నికల హడావుడిలో ఆటవిడుపు

- హెచ్‌సియులో ఫుట్‌బాల్ ఆడిన సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొద్దిరోజులుగా ఎన్నికల ప్రచారంతో బిజీబిజీగా గడిపిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆదివారం ఉదయం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా గోల్ వేసేందుకు విద్యార్థులతో పోటీ పడ్డారు. ఆట మధ్యలో షూ పాడైపోతే షూ లేకుండానే ఆడారు. అంతకుముందు సిఎంకు విద్యార్థులకు స్వాగతం పలికారు. ఇరు జట్ల ఆటగాళ్లను పరిచయం చేసుకున్నారు.సిఎంతోపాటు ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, టిఎంఆర్ ఐఇఎస్ ప్రెసిడెంట్ ఫహీం ఖురేషీ, హెచ్‌సియు ఎన్ఎస్‌యూఐ యూనిట్, హెచ్‌సియు విద్యార్థులు ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఫుట్‌బాల్ మ్యాచ్‌కి సిఎం సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఏంఏ ఫహీం, టీ శాట్ సీఈఓ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

తడిసిన ధాన్యం కొనండి

- అధికారులకు సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

ప్రజాశక్తి –హైదరాబాద్‌బ్యూరో

అకాల వర్షాలకు తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తడిసిన ధాన్యం గురించి రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. ఆదిలాబాద్, మెదక్, సంగారెడ్డితోపాటు పలు జిల్లాల్లో గాలి వాన, పిడుగులు, వడగళ్ల పడి పంట నష్టం జరిగిన విషయం తెలిసిందే. దీనిపై ఆదివారం ఆయన వివరాలు తెప్పించుకుని పరిశీలన చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచనలు ఉన్నందున జిల్లాల్లో కలెక్టర్లు, ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎక్కడ ఎలాంటి ఆపద వచ్చినా సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలంలో పిడుగు పడి ఇద్దరు మృతి చెందిన సంఘటనపై సిఎం విచారం వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకుంటా మన్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో పిడుగుపాటుతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయని, వారికి తగిన వైద్య సాయం అందేలా చూడాలని అక్కడి అధికారులను ఆదేశించారు.

నల్లగొండ ఎంపి నియోజకవర్గ పరిధిలో పోలింగ్ విధులకు గైర్హాజారు అధికారులు

- 48 మందిపై కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ విధులకు హాజరుకావాల్సిన 48 మంది సిబ్బంది గైర్హాజరయ్యారు. పోలింగ్, అథర్, అసిస్టెంట్ ప్రొసీడింగ్ అధికారులు 48 మంది రిపోర్టు చేయాల్సి ఉండగా.. ఇంతవరకు విధులకు హాజరుకాలేదు. దాంతో వీరి మీద దేవరకొండ అసెంబ్లీ అసిస్టెంట రిటర్నింగ్ అధికారి బి.శ్రీనివాసులు దేవరకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గైర్హాజరైన సిబ్బందిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం1951 కింద, ఐపిసి సెక్షన్ 134 ఆర్పీ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన.. దేవరకొండ ఆర్‌డిఒ శ్రీరాములును, స్పెషల్ కలెక్టర్‌ను, పార్లమెంట్ డిప్యూటీ ఆర్ఒ ఎన్.నటరాజన్‌ను ఆదివారం ఆదేశించినట్టు తెలుస్తోంది. దాంతో దేవరకొండ ఆర్‌డిఒ శ్రీరాములు ఫిర్యాదు మేరకు దేవరకొండ సిఐ 48 మందిపై కేసు నమోదు చేశారు. కాగా, ఈ నెల మొదటి వారంలోనే ఎన్నికల విధులకు హాజరుకావాల్సిన అధికారులకు శిక్షణా తరగతులు కూడా ఏర్పాటుచేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న వీరు విధులకు హాజరుకాకపోవడంతో కలెక్టర్, సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి : పెన్షనర్ల సంఘం

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని ఆ సంఘం అధ్యక్షుడు గోపాలం అన్నారు. ఆదివారం పట్టణంలోని అక్షర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్ పెన్షనర్ల సంఘంలో 450 మంది సభ్యులు ఉన్నారని, ప్రతీ నెలా సమావేశం నిర్వహించుకోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే పెన్షనర్లకు 300 గజాల స్థలం కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర మైహెూం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు సహకారంతో పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి కషి చేస్తామన్నారు. పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏలు, నూతన పీఆర్సీలను వెంటనే ప్రకటించి నగదు రూపంలో చెల్లించాలన్నారు. నగదు రహిత వైద్యసేవలను ఉచితంగా ప్రభుత్వం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెన్షనర్లు అయిన విద్యావతి, దేవేంద్రప్ప పుట్టిన రోజు సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సూర్యప్రకాష్, పెన్షనర్ల సంఘం గౌవవాధ్యక్షుడు సంజన్న, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి సిద్ధిలింగయ్య, సుజాత, విద్యావతి, మల్లికార్జున్, తులిశప్ప, నర్సమ్మ, గోవిందు, రాములు, జగదీష్, రాంచందర్, దేవణ్ణ, ఖాదర్‌భాష, తిప్పారెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ ఎన్నికలు దేశ భవిష్యత్తుకు కీలకం

- ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే, సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ పార్లమెంట్ ఎన్నికలతోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని, లౌకికవాదాన్ని బలపరిచేందుకు ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలపై దేశ రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ఆధారపడి ఉందని అన్నారు. యువత భవిష్యత్తు ఈ ఎన్నికలతో ముడిపడి ఉందని, దేశ సమగ్రతను కాపాడేందుకు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. పదేండ్ల కాలంలో మోడీ ప్రభుత్వం దేశాన్ని విచ్ఛిన్నం చేసిందని, మతం పేరిట విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూసిందని విమర్శించారు. దేశ ప్రజల సంపదను మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టిందని విమర్శించారు. రిజర్వేషన్లు రద్దుచేసి బడుగు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా దేశ ప్రజలపై మమకారం ఉన్నట్టు మోడీ నాటకాలు ఆడుతున్నారని అన్నారు. పదేండ్ల కాలంలో మోడీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ఏమి లేదని, ప్రజలకు చెప్పుకునేందుకు ఏమీ లేకనే ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మోడీ ప్రభుత్వం ఇప్పటికి అనేక కుట్రలు చేస్తోందని తెలిపారు. దేశంలో రానున్నది లౌకిక ప్రభుత్వమని జోష్యం చెప్పారు. ఇప్పటివరకు జరిగిన మూడు విడతల పోలింగ్‌లో ఎన్‌డిఎ కూటమికి ప్రతికూల వాతావరణం నెలకొందని, నేడు జరిగే నాలుగో విడత పోలింగ్‌లో కూడా మోడీకి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు ప్రజల సిద్ధమయ్యారని చెప్పారు. ఎన్‌డిఎ కూటమికి 200 సీట్లు దాటవని, ఇండియా వేదాకకు స్పష్టమైన మెజార్టీ రాబోతుందన్నారు. బిజెపి ప్రభుత్వ మోసపూరిత మాటలను ప్రజలందరూ గ్రహించారని చెప్పారు. ప్రజలు అన్ని విషయాలను పరిగణలోకి ఆలోచించి లౌకికవాదాన్ని బలపరిచేందుకు ఇండియా వేదికకులోని కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేశ్, జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి పాల్గొన్నారు.



శివపార్వతికి పురస్కారం ప్రదానం చేస్తున్న రామరాజు తదితరులు

నటి శివ పార్వతికి మహానటి సావిత్రి పురస్కారం

ప్రజాశక్తి - కల్చరల్

భిన్న పాత్రలలో నవరసాలను పోషించగల ప్రతిభ వున్న నటి శివపార్వతి అని ప్రముఖులు కొనియాడారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై కళారవిందం సాంస్కృతిక వేదిక తృతీయ వార్షిక వేడుకలులో శివపార్వతికి మహానటి సావిత్రి స్మారక పురస్కార ప్రదాన సభ జరిగింది. అధ్యక్షత వహించిన వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ.. శివ పార్వతి నేత్రాలతో సావిత్రి వల్లే భావాలు పలికించే శక్తి ఉన్న అరుదైన నటి అని అన్నారు. రచయిత సంజీవి మాట్లాడుతూ.. శివ పార్వతి కోసం ప్రత్యేకంగా తాను కొన్ని పాత్రలు సృష్టించాననీ ఆమె మాత్రమే ఆ పాత్రలు చేయగలరని వివరించారు. సంస్థ స్థాపకుడు రామ్ కుమార్ స్వాగతం పలుకుతూ తమ సంస్థ మూడు సంవత్సరాలలో ఏభై పైగా సంగీత ఇతర నిర్వహించిందని ఇకపై కూడా కొనసాగిస్తామని తెలిపారు ఈ సందర్భంలో ప్రదీప్ చంద్ర కె రవి నాగేంద్ర మణి బాబు రేణుక అఖిల జ్యోతి పాడిన తెలుగు హిందీ గీతాలు ఆకట్టుకున్నాయి.

ప్రచారంలో కొత్త పుంతలు...

- మీమ్స్, వీడియోలు, వ్యాఖ్యలతో హోరెత్తుతున్న క్యాంపెయిన్
- ప్రత్యర్థులపై వ్యంగ్యాస్త్రాలు

న్యూఢిల్లీ : ఇప్పుడు దేశంలో ఎన్నికల ప్రచారం కొత్త పుంతలు తొక్కుతోంది. బిజెపి, కాంగ్రెస్, ఆప్ సహా పలు రాజకీయ పార్టీలు హాస్యభరితమైన విజువల్స్, ఏక వాక్య వ్యాఖ్యలతో ఓటర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కొన్ని పార్టీలు మీమ్స్ ద్వారా ఎన్నికలను జోక్‌గా మార్చేస్తున్నాయి.

'వాషింగ్ మెషిన్' మీమ్‌కు ప్రాచుర్యం

గత నెలలో యూత్ కాంగ్రెస్ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో ఓ మీమ్ కన్పించింది. అందులో కాషాయ వాషింగ్ మెషిన్‌ను ప్రదర్శించారు. కుంభకోణాలు, పోలీసు కేసులు, ఈడీ దాడులు, సీబీఐ దాడులు, ఐటీ నోటీసుల పేరుతో ఆ మెషిన్‌కు బటన్స్ ఏర్పాటు చేశారు. దాని కింద 'పార్టీ మారితే ప్రతి మరక మాసిపోతుంది' అనే ఏకవాక్య వ్యాఖ్య ఉంది. బిజెపి వాషింగ్ మెషిన్ పేరిట కాంగ్రెస్ పెద్ద ఎత్తున ప్రారంభించిన ప్రచారంలో భాగమే ఈ మీమ్. 2017లో ప్రఫుల్ పటేల్‌పై మోపిన అవినీతి కేసును గత సంవత్సరం మార్చిలో సిబిఐ మూసివేసింది. గత సంవత్సరం జూలైలో ఎన్‌సిపికి ప్రఫుల్ పటేల్ కటీఫ్ చెప్పారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపితో చేతులు కలిపారు. ఈ ఉదంతాన్ని కాంగ్రెస్ మీమ్ పరోక్షంగా ప్రస్తావించి, బిజెపిని ఎత్తిపొడిచింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రచారానికి ముందు కాంగ్రెస్ పార్టీ విలేకరుల సమావేశంలో వాషింగ్ మెషిన్‌ను ప్రదర్శించింది. అది పూర్తి ఆటోమేటిక్ వాషింగ్ మెషిన్ అని, బిజెపిలో చేరితే కేసులు మూసేస్తామన్న సూత్రంపై అది పనిచేస్తుందని వ్యంగ్యోక్తులు విసిరింది. ఈ మీమ్‌కు మంచి ప్రాచుర్యం లభించింది.

యువ వీక్షకులే లక్ష్యంగా...

పార్టీ సామాజిక మాధ్యమ వేదికలపై పోస్ట్ చేసిన మీమ్ ఇదొక్కటే కాదు. గత సంవత్సరం ఇతర పార్టీల మాదిరిగానే కాంగ్రెస్ కూడా మీమ్స్, రీల్స్, వీడియోలను పోస్ట్ చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించింది. వినోదం, హాస్యం, వ్యంగ్యం ద్వారా యువ వీక్షకులను ఆకర్షించడమే దీని ప్రధాన ఉద్దేశం.

సంగీత భరితమైన వీడియోలు, ఆధునిక మీమ్స్ ద్వారా పార్టీలు ప్రజల్లోకి రాజకీయ సందేశాలను తీసుకొనిపోతున్నారు. సిద్ధాంతాల ప్రచారానికి సామాజిక మాధ్యమ వేదికలు యుద్ధ భూములుగా మారిపోయాయి. హాస్య ప్రధానమైన విజువల్స్, ఏక వాక్య వ్యాఖ్యల కారణంగా ప్రజల మనసుల్లో మీమ్స్ రోజంతా అలాగే నిలిచిపోతున్నాయి. ప్రజాభిప్రాయాన్ని మార్చడంలో మీమ్స్‌కు ఉన్న శక్తిని రాజకీయ పార్టీలు గుర్తించాయి. ప్రత్యర్థి పార్టీలను ఎద్దేవా చేస్తూ మీమ్స్‌ను రూపొందించే పనిలో అవి నిమగ్నమయ్యాయి.

ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలకు లక్షలాది ఫాలోయర్లు

బిజెపికి అత్యధికంగా 78 లక్షల ఇన్‌స్టాగ్రామ్ ఫాలోయర్లు ఉన్నారు. కేజ్రీవాల్, మమతా బెనర్జీ, లాలూ ప్రసాద్ యాదవ్‌లను కించపరిచేలా బిజెపి అనేక వ్యంగ్య మీమ్స్‌ను పోస్ట్ చేసింది. మీమ్స్ ప్రాధాన్యతను అర్థం చేసుకున్న రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమ విభాగాలను ఏర్పాటు చేసుకొని రచయితలు, మీమ్స్ సృష్టికర్తలను నియమించుకుంటున్నాయి. కాంగ్రెస్, ఆప్ పార్టీల ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్లకు లక్షలాది మంది ఫాలోయర్లు ఉన్నారు.

కాంగ్రెస్ మేధోమథన బృందం ప్రతిరోజూ ఉదయం 8.30 గంటలకు సమావేశమవుతుంది. తాజా మీమ్స్ రూపకల్పనపై కసరత్తు చేస్తుంది. మీమ్స్ సంస్కృతి ఎప్పటి నుండో ఉన్నప్పటికీ ఇప్పుడిప్పుడే ఊపందుకుంటోంది. కాంగ్రెస్ పార్టీ ప్రతి రోజూ ఇన్‌స్టాగ్రామ్‌లో 30–40 పోస్టులు పెడుతుంది. వాటిలో మీమ్స్ ఎక్కువ సంఖ్యలో ఉంటాయి. ఆప్ కూడా 20 మంది సిబ్బందిని నియమించుకొని మీమ్స్‌ను రూపొందిస్తోంది.

హైదరాబాద్ - విజయవాడ హైవేపై వాహనాల రద్దీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆ రాష్ట్ర ఓటర్లు స్వస్థలాలకు తరలి వెళ్తున్నారు. హైదరాబాద్‌లో స్థిరపడిన అక్కడి వారంతా బయల్దేరడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. సొంత వాహనాల్లో వెళ్లేవారితో హైదరాబాద్- విజయవాడ హైవేపై పలుచోట్ల ట్రాఫిక్‌జామ్ అయ్యింది. మరోవైపు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారూ నగరం నుంచి స్వగ్రామాలకు బయల్దేరారు. పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డుపైకి చేరుకోవడంతో పలుచోట్ల రాకపోకలు ఆలస్యమవుతున్నాయి. దీంతో హైదరాబాద్ శివారు హయత్‌నగర్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఆదివారం చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

ఓటర్లకు పంచేందుకు తరలిస్తున్న నగదు పట్టివేత

- ఖమ్మంలో కారును అడ్డుకోవడంతో ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ ఎత్తున నగదు పట్టుబడింది. ఎన్నికల వేళ ఓటర్లకు పంచేందుకే ఈ డబ్బు తరలిస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మెదక్ జిల్లా మాసాయిపేట వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో షిఫ్ట్ డిజైర్ వాహనంలో 27 ప్యాకింగ్ చేసిన కవర్లు కనిపించాయి. వాటిని ఓపెన్ చేసి చూడగా రూ.88.43 లక్షల నగదు లభించినట్టు రామాయంపేట సిఐ వెంకటేష్ తెలిపారు. డబ్బులకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. రెండు వాహనాలను సీజ్ చేసి విచారణ జరుపుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐతో పాటు చేగుంట ఎస్‌ఐ బాలరాజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. హైదరాబాద్ నుండి ఖమ్మంకు డబ్బులు తరలిస్తున్న కారును.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశ్వాపురం గ్రామ శివారు దేవన్‌తండా వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వారి నుంచి కారును తప్పించే క్రమంలో బోల్తా కొట్టింది. కారులో రూ.99.94 లక్షలు లభ్యమయినట్టు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. నగదు, కారు సీజ్ చేసినట్లు డ్రైవర్ సైదయ్య, పాల్వంచ రాజేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడే పోలింగ్

- ఏడు గంటల నుంచి ప్రారంభం
- 17 లోక్‌సభ, కంటోన్మెంట్ అసెంబ్లీకి ఎన్నికలు
- లోక్‌సభ బరిలో 525 మంది, కంటోన్మెంట్ బరిలో 15 మంది పోటీ
- రాష్ట్రంలో 3,32,32,318 మంది ఓటర్లు
- నిర్దేశిత సమయానికి వరుసలో ఉన్న వారికి ఓటేసేందుకు అనుమతి
- ఇసి పకడ్బందీ చర్యలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ నాలుగో విడత ఎన్నికల్లో బాగంగా రాష్ట్రంలోని 17 నియోజకవర్గాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీకి నేడు పోలింగ్ జరగనుంది. ఇందు కోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శనివారం రాత్రికల్లా ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో ఉదయం 5.30 గంటలకు పోలింగ్ అధికారులు (పిఒ) మాక్ పోలింగ్ నిర్వహిస్తారు. ఏజెంట్లనుంచి ఏవైనా అభ్యంతరాలుంటే వాటిని నివృత్తి చేసి ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభిస్తారు. సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించిన 13 అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు, మిగతా 106 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35,809 పోలింగ్ కేంద్రాల్లో 3,32,32,318 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి వరుసలో నిలబడే వారికి ఎంత సమయమైనా ఓటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఇవిఎంలను ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి జిపిఎస్ వాహనంలో కేటాయించిన స్ట్రాంగ్ రూంలకు తరలిస్తారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వాటికి మూడంచెల భద్రత కల్పిస్తారు. ఇన్నర్ సర్కిల్‌లో కేంద్ర దళాలు, సెకండ్ సర్కిల్‌లో స్టేట్ రిజర్వ్ దళాలు, చివరి సర్కిల్‌లో స్థానిక పోలీసులు పహారా కాస్తారు. రాష్ట్రంలో ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు ఎన్నికల సంఘం పకడ్బంది ఏర్పాట్లు చేసింది.

ఎన్నికల బరిలో 525 మంది అభ్యర్థులు

రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో 525 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ప్రధానంగా ముఖా ముఖి పోటీ నెలకొని ఉంది. బిజెపి బలంగా ఉన్న కరీంనగర్, సికింద్రా బాద్, నిజామాబాద్ లాంటి కొన్ని నియోజకవర్గాల్లో త్రిముఖ పోటీ ఉందని భావిస్తున్నారు. పార్టీ మారి ఇతర పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలిచిన దానం నాగేందర్, కడియం కావ్య, బీబీ పాటిల్, రంజిత్ రెడ్డికి ఈ ఎన్నికలు అగ్ని పరీక్షగా మారనున్నాయి. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయి, లోక్‌సభకు పోటీ చేస్తున్న ఈటెల రాజేందర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, బాజిరెడ్డి గోవర్ధన్‌లకు సైతం ఈ ఎన్నికలు చావోరేవో తేల్చనున్నాయి.కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపితో పాటు 15 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. డబ్బు, అధికారం, కులం, తదితర అంశాల ప్రాతిపదికన హోరాహోరిగా సాగిన ఎన్నికల సంగ్రామంలో ఓటర్లు ఎవరిని కనికరించారన్నది జూన్ 4న తేలనుంది.

ఇవిఎంలు మొరాయిస్తే రీప్లేస్

పోలింగ్ స్టేషన్లలో ఇవిఎంలు మొరాయిస్తే ఈసీ నిబంధనల ప్రకారం సెక్టర్ ఆఫీసర్లు మార్చనున్నారు. ఇందుకోసం 25 శాతం ఇవిఎంలను అదనంగా అన్ని నియోజక వర్గాల వారిగా అందుబాటులో ఉంచారు. చిన్న చిన్న సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే బాగు చేసేందుకు వాటిని సరఫరా చేసిన ఇసిఐఎల్ కంపెనీ ఇంజనీర్లు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు ఇద్దరేసి చొప్పున అందుబాటులో ఉంటారు. పోలింగ్ స్టేషన్లో దౌర్జన్యం, ఓట్ల గందర గోళం, రిగ్గింగ్, ప్రలోభాలు లాంటి సంఘటనలు జరిగితే స్థానికి పిఒ ఇచ్చే నివేధిక అధారంగా ఎన్నికల సంఘం రీపోలింగ్‌కు ఆదేశిస్తుంది.

ఓటర్లకు ఇసి సూచనలు

1). ఓటు వేయడానికి వెళ్లేటప్పుడు ఎవరూ తమ మొబైల్‌ని తీసుకెళ్లకూడదు.
2). ఓటు వేసేటప్పుడు స్లిప్ కనిపించే వరకు (7 సెకన్లు) బటన్‌ను నొక్కి ఉంచండి.
3) ఇవిఎం మెషీన్‌లోని బటన్‌ను నొక్కినప్పుడు స్లిప్ బయటకు వచ్చే వరకు బటన్ నుండి వేలిని తీసివేయకూడదని గుర్తుంచుకోండి.
4) స్లిప్‌తో మీ ఓటు వేసామని నిర్ధారించుకున్న తర్వాత బయటకు రండి
5). మీ ఓటు ఇదివరకే ఎవరైనా వేస్తే వెంటనే పిఒకు ఫిర్యాదు చేసి టెండర్ ఓటు వేయవచ్చు
6). పోలింగ్ స్టేషన్లో అవకతవకలు జరిగితే వెంటనే సీవిజిల్, 1950 టోల్‌ఫ్రీ నెంబర్ ఎన్‌జిఎస్‌పి పోర్టల్ ద్వారా వెంటనే ఫిర్యాదు చేయండి.

ఓటు హక్కు వినియోగించుకోనున్న ప్రముఖులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని ప్రముఖులు నేడు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోడంగల్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 237లో, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ సిద్దిపేట జిల్లా చింతమడకలో, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి బర్కత్ పురలోని దీక్షా హైస్కూల్‌లో ఓటేయనున్నారు. రాంనగర్‌లోని జెవి హైస్కూల్‌లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మలక్ పేట జీహెచ్ఎంసి కమ్యూనిటీ హాల్‌లో త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ ఎస్ఆర్‌నగర్‌లోని పోలింగ్ బూత్ నెంబర్ 188లో ఓటేయనున్నారు.. మంత్రి దామోదర రాజనర్సింహ సంగారెడ్డి జోగిపేటలో, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దంపతులు నందినగర్ కమ్యూనిటీ హాల్‌లో, మాజీ మంత్రి హరీశ్ రావు సిద్దిపేట భరత్‌నగర్‌లో ఓటేయనున్నారు. జూబ్లీహిల్స్ ఓబుల్‌రెడ్డి స్కూల్ లో జూనియర్ ఎన్‌టిఆర్, ప్రణతి, బిఎస్ఎన్ఎల్ సెంటర్‌లో అల్లు అర్జున్, స్నేహారెడ్డి అల్లు అరవింద్, అల్లు శిరీష్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో మహేశ్‌బాబు, నమ్రత, మంచు మోహన్‌బాబు, విష్ణు, లక్ష్మి, మనోజ్, విజయ దేవరకొండ, ఆనంద్ దేవరకొండ ,శ్రీకాంత్, జీవిత రాజశేఖర్ తమ ఓటును వినియోగించుకోనున్నారు. జూబ్లీహిల్స్ క్లబ్‌లో చిరంజీవి, సురేఖ, రాంచరణ్, ఉపాసన, నితిన్. ఎమ్మెల్యే కాలనీ లో రవితేజ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ లో నాగార్జున, అమల, నాగచైతన్య, అఖిల్, మణికొండ హైస్కూల్‌లో వెంకటేశ్, బ్రహ్మానందం షేక్ పేట్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో దర్శకులు రాజమౌళి ఓటేస్తారు. యూసఫ్‌గూడ చెక్‌పోస్టు ప్రభుత్వ పాఠశాలలో అల్లరి నరేష్, సలీంనగర్ పోలింగ్ బూత్‌లో తనికెళ్ల భరణి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

కుమారుడిని హత్య చేసిన తండ్రి

బెట్టింగులు, జల్సాలకు అలవాటు పడ్డ కొడుకు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బెట్టింగులు, జల్సాలకు అలవాటు పడి రూ. రెండు కోట్లు పోగొట్టుకున్న కుమారుడిని తండ్రి దారుణంగా హత్య చేసిన ఘటన మెదక్ జిల్లా చిన్న శంకరంపేట గ్రామపంచాయతీ పరిధిలోని బాగిర్తిపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న శంకరంపేట మండలం బాగిర్తిపల్లి గ్రామానికి చెందిన రెడ్డి ముఖేష్ కుమార్ (28)కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. వడియారం రైల్వే స్టేషన్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ముఖేష్ కుమార్ తండ్రి సత్యనారాయణ రైల్వే ఉద్యోగిగా విధులు నిర్వహించి వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. సత్యనారాయణ పెద్ద కొడుకైన ముఖేష్ కుమార్‌కు రైల్వే ఉద్యోగం ఇప్పించారు. కాగా, ముఖేష్ కుమార్ జల్సాలు, బెట్టింగులకు అలవాటుపడి మేడ్చల్‌లోని ఇల్లును, ప్లాట్లనూ అమ్మేశారు. తండ్రి సత్యనారాయణ పలుమార్లు మందలించినా మార్పు రాలేదు. సహనం కోల్పోయిన తండ్రి.. శనివారం రాత్రి కొడుకు తలపై రాడుతో దారణంగా కొట్టి చంపేశాడు. సంఘటనా స్థలాన్ని రామాయంపేట సిఐ వెంకటేశ్‌తో పాటు ఎస్ఐ నారాయణ గౌడ్, క్లూస్ టీంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. స్థానిక ఎస్ఐ నారాయణ గౌడ్ కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పిడుగుపాటుకు ముగ్గురు మృతి

- మెదక్ జిల్లాలో తడుస్తున్న ధాన్యానికి టార్పాలిన్ కప్పుతుండగా ఘటన
- తాత మనుమడు మృతి, ఆదిలాబాద్‌లో ఒకరు..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో పిడుగులు పడి ముగ్గురు మృతిచెందిన ఘటన మెదక్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆదివారం జరిగింది. మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలంలోని రామోజీ పల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రమైన ఐకెపీ సెంటర్‌లో ఆరబోసిన వరి ధాన్యం వర్షానికి తడుస్తోందని తాటిపత్రిలు కప్పడానికి వెళ్లిన రైతు పాల్వంచ శ్రీరాములు (50), అతని మనవడు విశాల్ (11) ఆదివారం సాయంత్రం పిడుగు పడి మృతి చెందారు. వరికుప్పపై సంచులు కప్పి చెట్ల కిందికి వెళితే పిడుగు పడుతుందనే భయంతో అక్కడే వరికుప్ప వద్ద నెత్తులపై సంచులు కప్పుకొని కూర్చోగా వారి పైన పిడుగు పడి మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాగా పిడుగు పడి, ఏడుగురికి గాయాలయ్యాయి. అందులో మామిడిపెల్లి కిరణ్ (44) మృతి చెందగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పిడుగు పాటుకు గురైన వారిలో గ్రామస్తులు కోల భోజన్న, టింగేని రమేష్, సంటెన్న, కుందేని రమేష్, భీంరావు, అమ్ములు రమేష్ ఉన్నారు.

ఈదురుగాలుల వర్షం.. ఇబ్బంది పడ్డ ఎన్నికల సిబ్బంది

- ఆసిఫాబాద్‌లో తెగిన గుండివాగు తాత్కాలిక వంతెన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



అకాల వర్షానికి, ఈదురుగాలులకు ఎన్నికల కోసం సిద్ధమవుతున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల మైదానంలో అధికారులు ఇవిఎంలు, వివి ప్యాడ్స్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఆదివారం అనుకోకుండా ఈదురుగాలులతో కూడి వర్షం పడటంతో సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్ పడిపోగా టెంట్ నుంచి నీళ్లు రావడంతో నిలబడటానికి సైతం సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ఫ్లెక్సీలు కప్పుకొని వర్షం పడకుండా జాగ్రత్త పడగా, కొందరు తమ సామగ్రిని పట్టుకొని కళాశాల వరండాలోకి పరుగులు తీశారు. భారీ వర్షం కురవడంతో ఎన్నికల సామగ్రిని డిస్ట్రిబ్యూట్ చేసేందుకు సిద్ధంగా ఉన్నా ఇవిఎంలు, వివి ప్యాడ్స్ కలవకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని పిటిజి కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఉన్న రిజర్వు సిబ్బందికి వేసిన టెంట్లు కూలిపోవడంతో పక్కనే ఉన్న వరండాలోకి వెళ్లారు. గుండి గ్రామానికి వెళ్లే పోలింగ్ సిబ్బంది తాత్కాలిక వంతెన తెగిపోవడంతో కమన, కన్నరగాం గ్రామాల మీదుగా గ్రామానికి చేరుకున్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల పాఠశాలలో నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా వర్షానికి నీరు నిలిచిపోవడంతో సిబ్బంది ఇబ్బందిపడ్డారు. బాలుర పాఠశాలలో ఆదర్శ పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు వర్షం అడ్డంకిగా మారింది.

సిపిఎం వినతికి స్పందించిన ఇసి

- అందరికీ వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆదేశాలు
- కార్మికులకు నైట్‌షిప్టు డ్యూటీలు వేయొద్దు
- మెమో జారీ చేసిన కార్మిక శాఖ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పోలింగ్ సందర్భంగా సోమవారం నాడు డే షిఫ్టు, నైట్ షిఫ్టు అనే తేడా లేకుండా కార్మికులందరికీ వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాసిన లేఖకు ఎన్నికల సంఘం స్పందించింది. అందరికీ వేతనంతో కూడిన సెలవును అమలు చేయాల్సిందేనని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కార్మిక శాఖ ప్రధాన కార్యదర్శి ఐ రాణి కుముదిని మెమో విడుదల చేశారు. కంపెనీలు ఏవైనా సోమవారం సాయంత్రం తర్వాత నైట్ షిఫ్టులు కొనసాగించినట్టు తమ దృష్టికొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ ఆదేశాలు జారీ చేసినందుకు ఇసికి, కార్మికశాఖకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు ధన్యవాదాలు తెలిపారు. నైట్‌షిఫ్టుల్లో కార్మికులతో పనిచేయించుకునేందుకు కార్మిక శాఖ అనుమతులు ఇవ్వడంపై ఆదివారం హైదరాబాద్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్‌కు రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డిజి నర్సింహారావు ఫిర్యాదు చేశారు. రాష్ట్ర కార్యదర్శి రాసిన లేఖను అందించారు. కార్మికుల ఓట్లు పనిప్రదేశ ప్రాంతంలో కాకుండా సొంతూర్లలో ఉంటాయని, వారు ఓటేసి నైట్‌డ్యూటీ షిఫ్టుకు ఎలా రాగలుగుతారని ఇసి దృష్టికి తీసుకెళ్లారు. రెండు షిఫ్టులకే సెలవు వర్తింపు అని కార్మిక శాఖ జారీ చేసిన మెమోను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పూర్తివేతనంతో కూడిన సెలవును ఇవ్వాలని కోరారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్ 116 ప్రకారం గెజిట్ నెంబర్ 107లో కూడా కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. నేషనల్ ఆఫ్ సాఫ్ట్‌వేర్, సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్), యాజమాన్య సంఘాలు రెండు షిఫ్టులకే సెలవును పరిమితం చేయాలని కోరగా కార్మికశాఖ అందుకు సానుకూలంగా స్పందించడం దారుణమన్నారు. ఇసి ఆదేశాన్ని సైతం పరిగణనలోకి తీసుకోకుండా నైట్ షిఫ్టుకు హాజరయ్యే వారికి సెలవును రద్దు చేస్తూ మెమోను విడుదల చేయడం సరిగాదని తెలిపారు. దీనివల్ల ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదం కూడా ఉంటుందని హెచ్చరించారు. ఈసీ తక్షణమే జోక్యం చేసుకుని జిఒ నెంబర్ 222 ప్రకారం గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ కార్మికులకు వేతనంతో కూడిన పూర్తి సెలవు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న ఈసీ ప్రతి ఒక్కరికీ వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

బైక్ ట్యాంక్ పేలి పలువురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ద్విచక్ర వాహనం పెట్రోల్ ట్యాంక్ పేలి పది మందికి గాయాలైన ఘటన హైదరాబాద్ పాతబస్తీ భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మొఘల్‌పురా అస్లా ఫంక్షన్‌హాల్ సమీపంలో రోడ్‌పై వెళ్తోన్న బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో బైకర్ వెంటనే వాహనాన్ని ఆపేశాడు. మంటలు ఆర్పేందుకు స్థానికులు గుమిగూడారు. ఈ క్రమంలో పెట్రోల్ ట్యాంక్ ఒక్కసారిగా పేలిపోయింది. క్షతగాత్రులను సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న భవానీ నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

వంట చేస్తుండగా వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంజాగుట్టలో ఓ వృద్ధురాలి మెడలో గొలుసుని గుర్తుతెలియని ఆగంతకుడు చోరీ చేసిన ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలివాహననగర్‌లో నివాసముంటున్న విజయలక్ష్మి (75) ఇంట్లో వంట చేస్తుండగా ఇంటి వెనక నుంచి గోడదూకి వచ్చిన ఓ ఆగంతకుడు ఆమె మెడలోని నాలుగు తులాల బంగారు గోలుసును తెంపుకుని పరారయ్యాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పంజాగుట్ట ఎసిపి మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. సంఘటన స్థలంలోని సిసి కెమెరాను పరిశీలించారు.



సంప్రదాయ సంగీతం భావితరాలకు అందించాలి

ప్రజాశక్తి - కల్చరల్

సంస్కృతికి ప్రధానమైన సంప్రదాయ సంగీతాన్ని రక్షిస్తూ భావి తరాలకు అందించాల్సిన బాధ్యత గురువులు, తల్లితండ్రులపై వుందని వివిధ రంగాల ప్రముఖులు కోరారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై శ్యామ గాయత్రి మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శాస్త్రీయ సంగీత గురువు చిల్ల శివ పార్వతి జన్మదిన సందర్భంలో ఆమె శిష్య బృందం గానం, నాట్య గురువు జ్యోతి శేఖర్ శిష్యురాలు గాయత్రి శేఖర్ కూచిపూడి నాట్య ప్రదర్శన జరిగింది. ముఖ్య అతిథిగా కళా పోషకుడు గుదిబండి వెంకట రెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. శివ పార్వతి ఎందరో ఔత్సాహికులకు సంప్రదాయ సంగీతం నేర్పిస్తూ వారిని ఉత్తమ గాయకులుగా సమాజానికి అందిస్తున్నారని అభినందించారు. శ్రీ రామ సాంస్కృతిక సంస్థ స్థాపకుడు గొర్తి చంద్రశేఖర్, ప్రముఖ గాయకుడు త్రినాథరావు తదితరులు పాల్గొని నర్తకి గాయత్రి శేఖర్‌ను అభినయ నాట్య మంజరి బిరుదుతో సత్కరించారు.



అంతర్జాతీయ నర్సుల దినోత్సవం జరుపుకుంటున్న పలు ఆస్పత్రుల నర్సులు

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

- ఆస్పత్రుల్లో వేడుకలు
- నర్సుల సేవలు వెలకట్టలేనివంటూ ప్రశంసలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోగులకు నర్సింగ్ ఆఫీసర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనిదని పలువురు డాక్టర్లు ప్రశంసించారు. ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం మే12 సందర్భంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఆస్పత్రుల్లో ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ మాతా, శిశు ఆస్పత్రి, సనత్ నగర్ ఇఎస్ఐ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, ఉస్మానియా, గాంధీ హాస్పిటల్స్‌తో పాటు వరంగల్ ఎంజిఎం, నిజామాబాద్, నల్లగొండ, వనపర్తి తదితర జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో నైటింగేల్‌కు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయా వేడుకల్లో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ 1820 మే 12న ఇటలీలో జన్మించిన ఫ్లోరెన్స్ నైటింగేల్ జీవితం ఆదర్శమని కొనియాడారు. 1853లో లండన్‌లోని ఒక మహిళల ఆస్పత్రిలో సూపరిండెంట్‌గా చేరిన నైటింగేల్, 1854లో క్రిమియా యుద్ధంలో టర్కీలో గాయపడిన సైనికులకు సేవలు చేయడానికి నర్సుల బృందాన్ని తీసుకువెళ్లిందని గుర్తుచేశారు. 1859లో 'నోట్స్ ఆన్ నర్సింగ్' అనే పుస్తకాన్ని ప్రచురించిన నైటింగేల్, ప్రపంచంలోనే మొదటి నర్సుల శిక్షణ కాలేజీని కూడా స్థాపించిందని తెలిపారు. నైటింగేల్ సేవలను గుర్తించిన 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' సంస్థ 1965 నుండి నైటింగేల్ పుట్టినరోజైన మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. నర్సింగ్ ఆఫీసర్లు రోగులకు అందిస్తున్న సేవలను కొనియాడారు. రాష్ట్రంలో నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు, నర్సింగ్ కౌన్సిల్‌కు ఎన్నికలు, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్‌లో నర్సింగ్ ఆఫీసర్ల విభాగంలో వసతుల కల్పన, 2021లో నియామకమైన నర్సులకు రెగ్యులరైజేషన్ ప్రక్రియలో జాప్యాన్ని నివారించాలని చాలా కాలం నుంచి నర్సింగ్ ఆఫీసర్లు కోరుతున్న సంగతి తెలిసిందే. సనత్‌నగర్ ఇఎస్ఐసి మెడికల్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో డీన్ శిరీష్ కుమార్ చౌహాన్, ఎం.ఎస్.రాధిక నర్సింగ్ ఆఫీసర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు, అధ్యక్షులు ఎం.రామాంజనేయులు, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.మంజులత తదితరులు పాల్గొన్నారు. నిలోఫర్ ఆస్పత్రిలో నిర్వహించిన వేడుకల్లో ఆ ఆస్పత్రి సిఎస్ ఆర్ఎంఒ డాక్టర్ జ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వప్న, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీల్లో గెలుపొందిన నర్సింగ్ ఆఫీసర్లకు బహుమతులు అందజేశారు.

బోసిపోయిన హైదరాబాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఓట్ల పండుగతో భాగ్యనగరం బోసిపోయింది. సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లారు. దీంతో ఎప్పుడూ రద్దీగా ఉండే రహదారులు నిర్మానుష్యంగా మారాయి. హైటెక్‌సిటీ, మాదాపూర్, గచ్చిబౌలి, కోఠి, అబిడ్స్, బషీర్‌బాగ్, నాంపల్లి, లక్డీకాపూల్, అసెంబ్లీ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు తగ్గాయి. రాత్రి పగలూ తేడా లేకుండా ట్రాఫిక్ ఎక్కువగా ఉండే నగర రహదారులు ప్రస్తుతం.. ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తెలంగాణలో లోక్‌సభ, ఏపీలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరగనుంది.

హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



జీహెచ్ఎంసీ పరిధిలో భారీ వర్షం కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. నగర వాసులు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. వర్షం కారణంగా తలెత్తిన ఇబ్బందులపై టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, నల్గొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్‌లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది.